
రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

జహీరాబాద్, ఏప్రిల్ 24: జహీరాబాద్ ఈద్గా సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఇంజినీర్-ఇన్ చీఫ్ రాజేశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.100 కోట్లతో చేపడుతున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జితోపాటు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలో ఈ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభించనున్నామని, దీని కోసం పనులన్నీ వెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రహదారి పొడవునా లైటింగ్, సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ జిల్లా ఎస్సీ వసంత్‌నాయక్, ఈఈ రాంబాబు, జహీరాబాద్ డీఈఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఎస్పీ పంకజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీలు

## శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 20: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పారితోష్‌పంకజ్ సందర్శించారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల విషయంలో స్టేషన్ హౌస్‌ఆఫీసర్ వినాయక్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీపడవద్దని ఆదేశించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు మైనార్టీ నాయకులు ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. జిన్నారంలో విద్యార్థులు, మదర్సాపై జరిగిన దాడిపై సంపూర్ణ విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మతసామరస్యం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో జరిగిన తప్పుడు ప్రచారంతోనే విషయం తీవ్రతరమైందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడుతూ కోతులు విగ్రహాన్ని ధ్వంసం చేశాయని, దర్యాప్తులో గుర్తించి ఆధారాలతో సహా చూపి అందరిలో ఉన్న అపోహలను తొలిగించారన్నారు. జిల్లా పోలీసుశాఖ పనితీరును వారు అభినందించారు. ఉద్రిక్తత సమయంలో సంయమనంతో వ్యవహరించి అందరికీఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ వినాయక్‌రెడ్డి, మైనార్టీ నాయకులు లియాకత్ అలీ, అబ్దుల్ ఘనీ, మెరాజ్‌ఖాన్, మన్నాన్, వాజిద్ అలీ, సోహెల్, అఖ్లాక్, పాష తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 24: భారతీనగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి గురువారం శంకుస్థాపనలు చేశారు. డివిజన్‌లోని మ్యాక్‌సొసైటీలో రూ.44లక్షలతో పార్కు ప్రహరీ, కర్బింగ్ రెనోవేషన్ పనులు, ఎల్ఐజీలోరూ.23లక్షలతో పార్కు రెనోవేషన్, హెచ్ఐజీలో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిధులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టంగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో భారతీనగర్‌లో నిధుల వరద పారిందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కోసం జోనల్ కమిషనర్‌ను నిలదీస్తే తప్ప నిధులు మంజూరు కాలేదని చెప్పారు. కార్యక్రమంలో డీఈ దేవేందర్, ఏఈ ఫైజల్, నాయకులు పరమేశ్, ఐలేశ్, పాపయ్య, యాదగిరి, నాగేశ్వర్‌రావు, నందగోపాల్, రామరావు, యాదగిరిరెడ్డి, సామ్యూల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞానకేంద్రం కార్యదర్శి శివబాబు

## శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఏప్రిల్ 24: వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ శ్రామిక్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డా.శివబాబు అన్నారు. గురువారం శ్రామిక విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేది నుంచి మే 14 వరకు శ్రామిక్ విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి అభివృద్ధి చేసేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఈ వేసవి శిబిరాలను జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధి, ఎన్‌జీవో, హౌజింగ్‌బోర్డు, పస్తాపూర్, ఝరాసంగంలోని కుప్పానగర్, నాగన్‌పల్లి, బోరేగాం, బర్దీపూర్, అల్గోల్, రంజోల్, రాయికోడ్ మండలంలోని పిపడ్‌పల్లి, కోహీర్ మండలంలోని పిచేర్యాగాడి తదితర గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నమని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా మండలాల పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సమ్మర్ క్యాంప్

జిన్నారం, ఏప్రిల్ 24: విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి విద్యార్థులకు 15రోజులపాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు 7 ఏండ్ల 14 ఏండ్ల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

మనూరు, ఏప్రిల్ 24: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం మనూరు మండలం ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల కోసం రైతులు సివిల్ కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. భూ సరిహద్దులు గుర్తించడం ద్వారా రైతులకు శాశ్వతంగా భూ సమస్య పరిష్కారం అవుతుందని, ఇందుకు భూధార్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. భూధార్ ద్వారా రైతు పొలం గుర్తించి సరిహద్దులతో కూడిన మ్యాప్ ఇచ్చి దానికి ఒక నంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏవైనా భూ సమస్యలు ఉంటే రైతులకు 30రోజుల్లో పరిష్కరించాలనే ఉద్దేశంతో కొత్త చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. రైతులకు భూమికి సంబంధించిన ఏ సమస్యనైనా మండల కేంద్రంలోనే పరిష్కరించేలా ఉందన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ ఇచ్చిన ఆర్డర్‌తో సంతృప్తి పొందకపోతే ఆర్డీవో స్థాయికి వెళ్లవచ్చునని సూచించారు. ఆర్డీవో దగ్గర పరిష్కారం కానప్పుడు కలెక్టర్ వరకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవచ్చనన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం జూన్ నుంచి గ్రామంలో ప్రత్యేకంగా అధికారులు వచ్చి సమావేశాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం బోరంచ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ప్రత్యేక అధికారి రఘుబాబు, జిల్లా వ్యవసాయ కార్యదర్శి శివప్రసాద్, ఆర్డీవో అశోక్ చక్రవర్తి, తహసీల్దార్ విష్ణసాగర్, ఏడీఏ నూతన్ కుమార్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సుభాష్‌రావు పాటిల్, డిగంబర్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, రాఘవాచారి, సిద్దారెడ్డి, అశోక్‌రావు, సంగన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

### భూమి హక్కులపై స్పష్టత

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 24: భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో, ఇతర రెవెన్యూ శాఖాధికారులతో కలిసి భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ భూ భారతి చట్టం ద్వారా భూమి హక్కులపై స్పష్టత కలుగుతుందన్నారు. ఈ చట్టంపై గ్రామాల్లో రైతులకు విస్తృతంగా చర్చలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు భూముల విషయంలో తప్పు నిర్ణయం తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. రైతులకు చేకూరే ప్రయోజనాలపై కలెక్టర్ రైతులకు అర్థమయ్యేలా వివరించారు. భూ సమస్యను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్‌కు అధికారం కల్పించారని, అయినా సమస్య పరిష్కారం కాలేదని భావిస్తే అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతులకు రక్షణ కవచంలా పని చేస్తుందన్నారు. అధికారులు కర్తవ్యం సరిగా నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించి ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనులు చేస్తున్నారన్నారు. తహసీల్దార్ శివకృష్ణ, ఏడీఏ శివప్రసాద్, ఏవో ప్రవీణ్‌చారి, ఎంపీడీవో మహేశ్వర్‌రావ్ ఉన్నారు.

## ఘన వ్యర్థాల పారబోతపై తనిఖీలు

జిన్నారం, ఏప్రిల్ 24: బొల్లారం పారిశ్రామిక వాడలోని బహిరంగ ప్రదేశాల్లో పరిశ్రమల రసాయన ఘన వ్యర్థాల పారబోత స్థానికంగా కలకలం రేపింది. పారిశ్రామిక వాడలో నిత్యం జనాలు సంచరించే రోడ్డుపక్కనే పెద్దఎత్తున ఘన వ్యర్థాలను పారబోయడంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పీసీబీ అధికారి కుమార్ పాఠక్ ఆదేశాలతో పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్ ఘన వ్యర్థాలు పారబోసిన ప్రదేశాన్ని తనిఖీ చేశారు. రసాయన వ్యర్థ జలాలు, ఘన వ్యర్థాలను విచ్చలవిడిగా పారబోయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటికి సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించారు. ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించి..రిపోర్టుల ఆధారంగా బాధ్యులైన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రోడ్డు పక్కనే పరబోసిన ఘన వ్యర్థాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీందర్


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

## బ్యాంకు కేసుల రాజీకి లోక్ అదాలత్

సంగారెడ్డి, ఏప్రిల్ 24: చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర వెల్లడించారు. గురువారం జిల్లా కోర్టులో బ్యాంకర్లు, చిట్‌ఫండ్స్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ..బ్యాంకు, ఇతర కేసులను ఇరువర్గాలూ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్నచిన్న తగాదాలు పడి కేసులు నమోదు చేసుకొని, కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, కోర్టులో ఉన్న కేసులను రాజీ చేసుకొని సామరస్యంగా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో చెక్కు బౌన్స్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. కార్యాక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, బ్యాంకు అధికారులు, చిట్‌ఫండ్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

## కేతకీలో జడ్జి ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఏప్రిల్ 24 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం జహీరాబాద్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి గంట కవితాదేవి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జడ్జికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదచారణ చేసి గర్భ గుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి అభిషేకం, మంగళహారతి నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప జడ్జికి పూలమాల, శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందించారు.

## రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

జహీరాబాద్, ఏప్రిల్ 24: ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, మాజీ ఎంపీటీసీ జ్యోతి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ హుస్సేన్, షఫీయొద్దీన్, సిరాజోద్దీన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాభిప్రాయ సేకరణ

గుమ్మడిదల, ఏప్రిల్ 24: గుమ్మడిదల మున్సిపాలిటీలోని 109 సర్వే నంబర్‌లో ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తహసీల్దార్ పరమేశం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే నంబర్ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రతిపాదించడం, ఈ స్థలంలో అసైన్డ్‌భూములుగా కొంతమంది రైతులకు భూములను కేటాయించామన్నారు. ఈ విషయంపై శుక్రవారం ఉదయం 10 గంటలకు క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ విషయంపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలన్నారు.


జిన్నారం శివారులో చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

## కొనసాగుతున్న తనిఖీలు

జిన్నారం, ఏప్రిల్ 24: జిన్నారం మండల కేంద్రంలో పోలీసుల విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు సైతం గ్రామానికి వచ్చే ప్రధాన రస్తాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు కొనసాగిస్తున్నారు.ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతోంది. 163 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా ప్రజలు సహకరించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం పోలీసులు పహారా కాస్తున్నారు.

### బొంతపల్లిలో శిక్షణాశిబిరం

గుమ్మడిదల, ఏప్రిల్24: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వతేదీ నుంచి మే 13వ తేదీ వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాలను బొంతపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు స్పందించి విద్యార్థులు శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు.శిక్షణలో విద్యార్థులకు శాస్త్రీయ నృత్యం, సంగీతం, కథలు చెప్పడం, సాంస్కృతిక కార్యక్రమాలు, కుట్టు, అల్లికలు, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, యోగా, చేతిరాత, సైన్స్, గణితం వంటి అంశాల్లో శిక్షణ ఉంటుదన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


వాహనాలకు బీఆర్ఎస్ స్టిక్కర్లు అంటిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

## రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

సంగారెడ్డి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ సభకు తరలివెళ్లనున్న వాహనాలకు స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గం నుంచి వాహనాల్లో సభకు భారీగా తరలివెళ్లాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సభకు జనాలను తరలించాలని ఆదేశించామన్నారు. సభకు వెళ్లే వాహనాలు వాటి ఇన్‌చార్జిలతో ఫోన్‌లో మాట్లాడి అదే వాహనంలో ఇన్‌చార్జిలు ప్రయాణం చేయాలన్నారు. ముఖ్యంగా సభకు తరలివెళ్లే అభిమానులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింతా సాయినాథ్, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పెరుమళ్ళ నర్సింహులు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గోవర్ధన్ నాయక్, మాజీ కౌన్సిలర్లు షేక్ సాబేర్, దిడ్డి విఠల్, జీవీ శ్రీనివాస్, చిల్వరి మురళీధర్, నాయకులు చిట్కుల మల్లేశం, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

రాయికోడ్, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ నిర్వహించే రజతోత్సవ సభను విజయవతం చేయాలని బీఆర్ఎస్వీ కార్యదర్శి నాజీం పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ....27న వరంగల్‌లో పార్టీ తలపెట్టిన భారీ బహిరంగా సభ కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కోసం యావత్తు తెలంగాణ సమాజం, గులాబీ సైనికులు, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నేతృత్వంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున సభకు తరాలి రావాలన్నారు.

### జనసమీకరణ

హత్నూర, ఏప్రిల్ 24: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు హత్నూర మండలం నుంచి జన సమీకరణ చేస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు బహిరంగ సభకు తరలిరావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## వలస కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరు, ఏప్రిల్ 24 : వలస కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ఆరోపించారు. గురువారం పటాన్‌చెరులోని శ్రామిక్ భవనంలో ఏర్పాటు చేసిన వలస కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయని పరిశ్రమల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాన్నారు. మే 20న నిర్వహించే సమ్మెలో వలస కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొనాలన్నారు. వలస కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు పటిష్టమైన చట్టాలు అమలు చేయాని డిమాండ్ చేశారు. వలస కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పరిశ్రమల యాజమాన్యులు విఫమైయ్యారన్నారు. వలస కార్మికులకు ఈఎస్ఐ, ప్రమాదబీమా, పీఎఫ్, కనీస వేతనం, పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి రాజయ్య, రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

## రాబర్ట్‌వాద్రా వ్యాఖ్యలు గర్హనీయం: ఎంపీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24: బీజేపీ హిందువులను రెచ్చగొడుతున్నదని, బీజేపీ విధానాలతో దేశంలో ఉగ్రదాడులు జరుగుతున్నాయని రాబర్ట్‌వాద్రా మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ దేశంలో హింసను ప్రజ్వలించేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. భారత్‌లో అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనలో ఉన్నప్పుడు ఉగ్రదాడి జరగడం, పహల్గామ్‌లో ఉగ్రదాడిలో 27 మంది చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అంబేద్కర్‌ను అవమానించిందని కాంగ్రెస్ అని, ఆయన ఓటమికి కారణమైంది కాంగ్రెస్, కమ్యూనిస్టులే అని ఆరోపించారు. ప్రకాశ్‌రాజ్, కమల్‌హాసన్, ఉదయనిధి స్టాలిన్ నేడు ఎందుకు మాట్లాడడం లేదన ఎంపీ రఘునందన్ ప్రశ్నించారు. మతం పేరిట దాడి జరిగితే ఎందుకు స్పందించడం లేదన్నారు. తెలంగాణలో మదర్సాలు ఉండాలా.. వద్దా.. అనేది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించాలన్నారు. నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు ఎంపీ రఘునందన్ విమర్శించారు.

### ఉగ్రదాడికి నిరసనగా
# క్యాండిల్ ర్యాలీ


ఝరాసంగంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంఘం నాయకులు

జహీరాబాద్/ఝరాసంగం, ఏప్రిల్ 24: జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం పట్టణం, మండల కేంద్రాల్లో హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంతోపాటు మండల కేంద్రాలైన ఝరాసంగం, న్యాల్‌కల్ గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా హిందూ ధార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు క్యాండిల్ నిర్వహించారు. ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని కోరారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, హిందూ ధార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

### ఉగ్రవాదులను ఉరి తీయాలి

అందోల్, ఏప్రిల్ 24: జమ్ముకాశ్మీర్(పహల్గాం)లో అమాయకులపై కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ...మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ గురువారం రాత్రి జోగిపేట, వట్‌పల్లిలో బీజేపీ, వీహెచ్‌పీతోపాటు పలు హిందూ సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పహల్గాం దాడి పిరికిపందుల చర్య అన్నారు. మృతుల కుటుంబాలకు ఆ భగవంతుడు మనో ధైర్యాన్ని అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ముష్కరులను పట్టుకోవడం కోసం తీవ్రంగా శ్రమిస్తుందని వారిని పట్టుకొని బహిరంగంగా ఉరి తీస్తేనే మృతుల ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు.

### ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 24: ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని భెల్‌లోని వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు అన్నారు. గురువారం భెల్‌లో ఉగ్రదాడికి నిరసనగా నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల నాయకులు రెహమాన్, రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి 27మందిని పొట్టన బెట్టుకోవడం హేయమైన చర్య అన్నారు. ఉగ్రమూకలు లేకుండా ఇండియన్ ఆర్మీ ఏరిపారేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులపై ప్రతీకార చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి వారు సంతాపం తెలిపారు.


జోగిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## ఇంటర్ విద్యార్థినికి సన్మానం

జహీరాబాద్, ఏప్రిల్ 24: ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థిని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సన్మానించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేఖాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి షేక్‌అద్నాన్ సమీ ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 470/467 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించినందుకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శాలువాతో సత్కరించి, స్వీట్ తినిపించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, మాజీ సర్పంచ్ చిన్నరెడ్డి, నాయకులు మిథున్ రాజ్, గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


నల్లవల్లిలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు

## 79వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఏప్రిల్24: ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 79వ రోజుకు చేరుకున్నాయి. గురువారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రైతు జేఏసీ నాయకులు డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 79 రోజులుగా డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇటీవల జిల్లా యంత్రాంగం సూచన మేరకు డంపింగ్ యార్డుపై అభ్యంతరాలు తెలియజేయాలని సూచించడంతో వందకు వందశాతం ఎంఎస్‌డబ్ల్యూకు వ్యతిరేకంగా అభ్యంతరాలు తెలియజేసినా ఇప్పటి వరకు ప్రభుత్వంగానీ, యంత్రాంగం గానీ స్పందించక పోవడం అన్యాయమన్నారు. వెంటనే డంపింగ్ యార్డు నిర్మాణ పనులు, ఇచ్చిన అనుమతుల విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.


పెద్దగోపులారంలో కేసీఆర్ క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

## యువత క్రీడల్లో రాణించాలి

మునిపల్లి, ఏప్రిల్ 24: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా....క్రీడల్లో రాణించాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దగోపులారంలో కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను క్రాంతి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. క్రీడలతో నూతన స్నేహం ఏర్పడుతుందన్నారు. యువకులు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. మండలంలో నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని, టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, మాజీఎంపీపీ చంద్రయ్య, యువత అధ్యక్షుడు ఆనంద్, నాయకులు భాగయ్య, అంజయ్య, నన్నూ పటేల్, విట్టల్, మహేందర్, ఆంజనేయులు, బేగరి రాజు, ప్రభు, రాజు, నర్సింహులు, మహేశ్ తదితరులు ఉన్నారు.



సిర్గాపూర్: తెలంగాణ మ్యూజిక్ సాంగ్ ప్లే చేసినప్పుడు స్టేజీపై నిలబడిన కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

## భూభారతితో సమస్యలు శాశ్వత పరిష్కారం

సిర్గాపూర్, ఏప్రిల్ 24: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నూతన భూభారతి ఆర్‌వోఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సిర్గాపూర్ మండలకేంద్రంలోని హైస్కూల్‌లో భూభారతిపై అవగాహన సదస్సును ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ఈ కొత్త చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, ఇది రైతులకు వరమని పేర్కొన్నారు. ప్రతి రైతుకు భూభారతిపై అవగాహన ఉండాలన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించారన్నారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దార్ అబ్దుల్ నజీం ఖాన్, ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీవో మల్సూర్‌నాయక్, కార్యదర్శి నవీన్‌రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు భూభారతిపై అవగాహన సదస్సు

జహీరాబాద్, ఏప్రిల్ 24: న్యాల్‌కల్‌లో శుక్రవారం భూభారతిపై అవగాహన సదస్సు ఉంటుందని తహసీల్దార్ భూపాల్ తెలిపారు. ఉదయం గ్రామంలోని బీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ మాధురీ, ఆర్డీవో రాంరెడ్డి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎంపీ సురేశ్‌కుమార్ శెట్కార్ హాజరుకానున్నారన్నారు. సదస్సుకు మండలంలోని అధికారులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సూచించారు.

### రేపు బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ హాల్లో...

అమీన్‌పూర్ ఏప్రిల్ 24: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై శనివారం అవగాహన సదస్సు ఉంటుందని తహసీల్దార్ రామస్వామి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సదస్సుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ మాధురీ, ఆర్డీవో రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొని భూభారతి నూతన చట్టంపై అవగాహన కల్పిస్తారన్నారు. అవగాహన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.